పీజీఈసెట్ పరీక్షలు షురూ

సాక్షి, హైదరాబాద్: ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించే పీజీఈసెట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహించారు. ఉదయం 87.14 శాతం, మధ్యాహ్నం 89.32 శాతం అభ్యర్థులు పరీక్షలు రాశారు. జూన్ 1 వరకు పరీక్షలు జరుగుతాయి.

ప్రశాంతంగా టీజీ పీజీఈసెట్ 2026 పరీక్షలు

- హైదరాబాద్, వరంగల్ కేంద్రాల్లో 88 శాతానికి పైగా హాజరు
- ఉదయం ఈసీఈ, బయోటెక్నాలజీ, మెకానికల్.. మధ్యాహ్నం సీఎస్ఈ, ఐటీ పరీక్షలు
- పరీక్షల సరళిని పరిశీలించిన ఉన్నత విద్యామండలి, జేఎన్‌టీయూహెచ్ అధికారులు

భూమి శ్రీనివాస్ రెడ్డి, నవభూమి ప్రతినిధి, కూకట్‌పల్లి, మే 29: తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, అనుబంధ ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కళాశాలల్లో 2026, 2027 విద్యా సంవత్సరానికి గాను పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన టీజీ పీజీఈసెట్ 2026 పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ ఉన్నత విద్యామండలి తరఫున జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ ఈ పరీక్షలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఫుల్ టైమ్ ఎంఈ ఎం.టెక్, ఎం.ఫార్మసీ, ఎం.ఆర్క్ గ్రాడ్యుయేట్ స్థాయి ఫార్మాడీ (పి.డి) కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు టీజీ పీజీఈసెట్ కన్వీనర్, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

మే 29న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన తొలి సెషన్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ, మెకానికల్ ఇంజినీరింగ్ సబ్జెక్టులకు పరీక్షలు జరిగాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సులకు పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. ఉదయం సెషన్ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 3,539 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 3,084 మంది (87.14 శాతం) హాజరయ్యారు. ఇందులో హైదరాబాద్ కేంద్రాల్లో 2,935 మందికి గాను 2,546 మంది, వరంగల్ కేంద్రాల్లో 604 మందికి గాను 538 మంది పరీక్ష రాశారు. ఇక మధ్యాహ్నం జరిగిన సీఎస్ఈ, ఐటీ పరీక్షలకు అత్యధికంగా 10,045 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, ఏకంగా 8,972 మంది హాజరై 89.32 శాతం హాజరు నమోదు చేశారు. మధ్యాహ్నం సెషన్‌లో హైదరాబాద్ నుంచి 8,593 మందికి గాను 7,640 మంది, వరంగల్ నుంచి 1,452 మందికి గాను 1,332 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

టీజీ పీజీఈసెట్ 2026 కంప్యూటర్ ఆధారిత పరీక్ష ప్రారంభ కార్యక్రమం ప్రక్రియను పలువురు ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ వీసీ, టీజీ పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, కన్వీనర్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. విజయకుమార్ రెడ్డి, ఉన్నత విద్యామండలి సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీనివాస్ వెంకటేష్, టీజీ పీజీఈసెట్ కో-కన్వీనర్ ప్రొఫెసర్ టి. శ్రీకాంత్, కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్. తారా కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు టీజీ పీజీఈసెట్‌కు 88 శాతం హాజరు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ తదితర కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే టీజీ పీజీఈసెట్ శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు 88 శాతం మంది హాజరయ్యారు. కాగా, మార్నింగ్ సెషల్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయోటెక్నాలజీ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలకు పరీక్షలు జరిగాయి. మొత్తం 3,539 మంది విద్యార్థులకు గానూ 3,084 మంది (87.14 శాతం) అటెండ్ అయ్యారు. మధ్యాహ్నం సెషన్ లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అభ్యర్థులకు నిర్వహించిన పరీక్షను 10,045 మందికి గానూ 8,972 మంది(89.32 శాతం) రాశారు. హైదరాబాద్, వరంగల్ సెంటర్లలో పరీక్షలు సజావుగా జరిగాయని పీజీఈసెట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. పరీక్షలను టీజీసీహెచ్ఈ చైర్మన్ బాలకిష్టారెడ్డి, జేఎన్టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ కె.విజయకుమార్ రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

పాలిసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

బాలానగర్: టీజీ పాలిసెట్‌లోఉత్తీర్ణులైన అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన జేఎన్‌టీయుహెచ్‌లో శుక్రవారం ప్రారంభమైంది. జూన్ 1 వరకు సర్టిఫికెట్లు పరిశీలిస్తామని అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ బాలు నాయక్ తెలిపారు. 380 మంది సర్టిఫికెట్స్ పరిశీలనకు హాజరు కావాల్సి ఉండగా 228 మంది మాత్రమే వచ్చారన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఉద్యోగులు

కూకట్‌పల్లి: డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి పరీక్ష రాసిన విద్యార్థులకు పాలిసెట్ కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. జేఎన్‌టీయూ ప్రవేశాల విభాగంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ కౌన్సెలింగ్‌లో మొదటిరోజు 380 మంది విద్యార్థులకు 325 మంది హాజరయ్యారు. ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ బి.బాలునాయక్ పర్యవేక్షణలో ఉద్యోగులు విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించి రశీదులు అందజేశారు. 6 గంటల వరకు కౌన్సెలింగ్ కొనసాగింది. కౌన్సెలింగ్ జూన్ 1వ తేదీ వరకు కొనసాగుతుందని బాలునాయక్ తెలిపారు.